
# బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ నాగరాజుపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

## మాజీ మంత్రి హరీష్‌రావు

**రామాయంపేట, మే 25, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజపై కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి దాడి చేయడాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త పోచమ్మల గణేష్ కౌన్సిలర్ నాగరాజుపై పెట్రోల్ పోసి దాడి చేయడం సహించరాని విషయం అన్నారు. దాడికి కారకులైన వ్యక్తిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హత్య రాజకీయాలు, బెదిరింపులు నిత్య కృత్యమయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలైన బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యర్తలను కాంగ్రెస్ పార్టీ బెదిరింపులతో నిలువరించలేదని ఆయన అన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# ఈనెల చివరిలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

## -జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు

**కొల్చారం, మే25 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల చివరి లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు తెలిపారు. శనివారం మండలంలోని రంగంపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోళ్లపై ఆరా తీశారు. పీఏసీఎస్ పరిధిలో ఇప్పటి వరకు 70 వేల బస్తాలను కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు రవాణా చేయడం జరిగిందన్నారు. మిగితా ధాన్యాన్ని గడువు లోగా తూకం వేసి మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ధాన్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా లారీలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, డైరెక్టర్ గంగయ్య, సీఈవో నవీన్, సిబ్బంది బీరప్ప, శ్రీనివాస్, సిద్ధూ, దుర్గేష్ రైతులు తదితరులు ఉన్నారు.



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి

**పుల్కల్, మే 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోడూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రిని ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, నాయకులు గోవర్ధన్, లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, అత్మూరి రవీందర్, కోడూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మార్మోగిన వీరభద్రాలయం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర్

**టేక్మాల్, మే 25, ప్రభాతవార్త:** బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహిచారు. వీరభద్రాలయంలో భక్తులు భక్తితో ఓం నమోశివాయ.. హర హర అంటూ శివనామా స్మరణలతో మారుమ్రోగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కళ్యాణ వేదికపై భద్రకాళీ, వీరభద్రుల కళ్యాణం కమనీయంగా జరిగింది. లోక కల్యాణార్థం కోసం తలపెట్టిన స్వామి కళ్యాణోత్సవానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్, అలయ పండితులు పూర్ణకుంభంతో ఘనంగా ఆహ్వానించారు.ఏడుపాయల దేవస్థాన కమిటీ చైర్మెన్ బాలగౌడ్ పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మంత్రిని కలిసిన గ్రామస్తులు మీరు ఇచ్చి నిధులతోనే రోడ్డు నిర్మాణం జరిగిందే తప్ప ఆనాయకులు ఏం చేయలేరని ఆలయ అభివృద్ధికి మంత్రి వర్యులు మరింత కృషి చేయాలని కోరాగా ఆయన సానుకులంగా స్పందిస్తూ తప్పకుండా చేద్దాం అన్నారు. కళ్యాణోత్సవానికి దంపతులు, నవదంపతులు వివాహోత్సవ కార్యక్రమానికి పెళ్ళి పెద్దలుగా మారారు. వివాహ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన విగ్రహాల ఊరేగింపులో స్వాములు చేసిన విన్యాసాలు.. గ్రామంలోని కొందరు మహిళలు, యువతులు పల్లకి సేవ ముందు కోలాటం చూపరులను ఎంతగానో అకట్టుకుంది. ఇందులో వేద పండితులు సతీషయ్య బృంధం, మండల నాయకులు రమేష్, మాన్‌కిషన్, మాల్లారెడ్డి, అవినాష్, కిశోర్, అనిల్, బొడ్మట్‌పల్లి పార్టీ నాయకులు వినోద్, మహేష్ రెడ్డి, భూషణం, సందీప్‌గౌడ్, బాలయ్య పాల్గొన్నారు.

## పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉంచాలి

### -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, మే 25, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యే లోపు విద్యార్థులకు ఏక రూప దుస్తువుల కుట్టు పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని యూసూఫ్‌పేటలో మహిళా స్వశక్తి యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10 వరగతి విద్యార్థులకు నాణ్యమైన ఏక రూప దుస్తులు అందించేలా కట్టు పనులు త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని నిర్వహకులకు సూచించారు. కేంద్రంలో సిద్ధంగా ఉన్న దుస్తువులను కలెక్టర్ పరిశీలించారు జిల్లాలో 78వేల ఏకరూప దుస్తులుగా లక్ష్యంగా మహిళ స్వశక్తి సంఘాలు 70 కేంద్రాల్లో కట్టు పనులు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు,ఏపియం సాయిలు, ఐకెపి సిసి యాదయ్య, గ్రామ స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల నిర్వహణపై ప్రత్యేక చర్యలు

### -జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

**పెద్దశంకరంపేట, మే25 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల నిర్వహణ మెరుగుపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. శనివారం ఆయన పెద్దశంకరంపేటకు వచ్చిన సందర్భంగా పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డు, పల్లె క్రీడా ప్రాంగణం, వన నర్సరీలను సందర్శించి వాటి నిర్వహణను పరిశీలించారు. గ్రామ పంచాయితీ ఆస్తులైన వీటిని సక్రమంగా వినియోగించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వీటి నిర్వహణ తీరును ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి వెంకటరాములు, కంప్యూటర్ ఆపరేటర్ నందు ఉన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రమేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

**సంగారెడ్డి బ్యూరో, మే 25, ప్రభాతవార్త:** జూన్ 10వ తేదీలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిని ఆరా తీశారు. విద్యార్థులు మంచిగా చదువుకునేందుకు అనువుగా ప్రభుత్వ పాఠశాల్లో సౌకర్యాల కల్పనకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఒక్క పని పెండింగ్ లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలల్లో కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందనితెలిపారు. పాఠశాలలలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, హ్యాండ్ వాషన ప్లాట్‌ఫామ్ వంటి మౌలిక వసతులతో పాటు చిన్న, చిన్న మరమ్మతు పనులు సైతం పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మైదానాలను ఉపాధి హామీ పథకం నిధులతో చదును చేపట్టాలని అన్నారు. రానున్న హరితహారంలో పండ్లమొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల ఫోటోలు పనులు ప్రారంభించడానికి ముందు, పనులు జరుగుతున్న సమయంలోను, పనులు పూర్తి అయిన తరువాత మూడు రకాల ఫోటోలను భద్రపరచాలని ఆయన పేర్కొన్నారు. జరుగుతున్న పనులను ఎక్కడైనా ఆటంకాలు కలిగిస్తే తక్షణం ఎంపీడీవోలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలు అలాగే కొనసాగితే తదుపరి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిల్లుల చెల్లింపులు జరిగిన ప్రతి పైసా లెక్కలు పక్కాగా ఉండాలని, చెల్లింపు వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇంకను చేపట్టాల్సిన పనులుంటే ప్రతిపాదనలు పంపాలని పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పంచాయితీ రాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, నర్సాపూర్ రూరల్, మే, 25. ప్రభాతవార్త :** నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు క్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో ధాన్యం తేమ శాతం, ట్యాబ్ ఎంట్రీ, రవాణా తదితర వివరాలను వివరాలను పరిశీలించి న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈవిదంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తోపాటు మండల తహశీల్దార్ కమలాద్రి, ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి, ఏపిఎం గౌరిశంకర్, సిసి ప్రవీణ, సిఏ మహేశ్వరి, కమిటీ సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివకుమార్

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివకుమార్

**హుస్నాబాద్, అక్కన్నపేట, మే 25, ప్రభాతవార్త :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులను హెచ్చరించారు.శనివారం రోజున వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హుస్నాబాద్‌లోని ఫర్టిలైజర్ షాపులతో పాటు అక్కన్నపేట మండలంలోని గొల్లకుంట,రేగొండ,జనగామ గ్రామాలలో తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా డీలర్లతో మాట్లాడుతూ డీలర్లు కనిలీ విత్తనాలు విక్రయించిన, విక్రయించినట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవన్నారు.రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా విత్తనాలకు సంబందించిన రశీదులు తీసుకోవాలని సూచించారు.షాపుల్లో కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్లు,రశీదును పంట పూర్తయ్యే వరకు దగ్గర ఉంచుకోవాలన్నారు.విత్తనాల విక్రయదారులు ఎవరెవరికి విత్తనాలు అమ్ముతున్నారని ప్రభుత్వం నిర్దేశించిన రిజిస్టార్‌లో నమోదు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డివిజన్ అధికారి మహేష్,హుస్నాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి నాగరాజు, ఏఈవోలు సబిహా, శ్రీలత,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడివో కార్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ సిఇవో

**నర్సాపూర్ మే, 25. ప్రభాతవార్త :** పట్టణంలోని ఎంపిడివో కార్యాలయాన్ని శనివారం మెదక్ జడ్పి సీఈవో సిహెచ్ ఎల్లయ్య సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడివో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచి సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో రంగాచార్యులు, సూపరిండెంట్ మనోహర్,జూనియర్ అసిస్టెంట్ , సిబ్బంది తదితరులు ఉన్నారు..



మాట్లాడుతున్న జడ్పి సీఈవో సిహెచ్ ఎల్లయ్య



అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

## అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను జూన్ 5లోగా పూర్తి చేయాలి : డిఇవో రాధాకిషన్

**వెల్దుర్తి, మే 25 ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను జూన్ 5లోగా పూర్తిచేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆరెగూడం, ఉప్పులింగాపూర్, ఉప్పులింగాపూర్ తండా, ఏదులపల్లి, బండపోచాన్‌పల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏదులపల్లి, ఉప్పులింగాపూర్ గ్రామాల్లోని పాఠశాల్లో పనులు నత్తనడకన సాగుతుండటంతో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అసహనం వ్యక్తంచేశారు. పనులను త్వరగా పూర్తిచేయాలని నిర్మాణ కార్మికులకు సూచించారు. జిల్లాలో మొత్తం 20కోట్ల రూపాయల పనుల్లో భాగంగా 25 శాతం ముందుగా అడ్వాన్సు ఇవ్వడం జరిగిందని, ముందుగా విద్యుద్దీకరణ, త్రాగునీరు, చిన్నపాటి మరమ్మత్తులు, టాయిలెట్లు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫామ్స్ సమయానికి అందించాలి : డిఆర్‌డివో

**వర్గల్, మే 25 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫామ్స్‌ను మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం కుట్టివ్వడం జరుగుతుందని డిఆర్‌డిఓ జయదేవ్‌ఆర్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో మహిళా సంఘాల ద్వారా యూనిఫామ్స్ కుట్టిస్తున్న కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభానికిముందే యూనిఫామ్స్ కుట్టి ఇవ్వాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. వారివెంట డిపిఎం వాసుదేవ్, ఏపిఎం సత్యనారాయణ, సీసీలు సుభాష్‌గౌడ్, సాయిలు, పద్మలత, విఓఏ రుక్మిణి, స్టిచ్చింగ్ మెంబర్ వసంత, సంఘ సభ్యులు ఉన్నారు.



యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న డిఆర్‌డిఓ జయదేవ్‌ఆర్య

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు : ఏసిపి



మాట్లాడుతున్న ఏసిపి పురుషోత్తంరెడ్డి

**గజ్వేల్, మే 25 (ప్రభాతవార్త):** ఫర్టిలైజర్స్ దుకాణాలలో కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, గజ్వేల్ సిఐ సైదాలు హెచ్చరించారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాలలో అకస్మిక తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీ బాలాజీ, పవనసుత, శ్రీసాయి ఫర్టిలైజర్స్‌లో కాలం చెల్లిన 610 కిలోల కూరగాయల విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యవసాయాధికారి నాగరాజు, అడిషనల్ అగ్రికల్చర్ డైరెక్టర్ బాబునాయక్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలతో పాటు నకిలీ పురగుమందులు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తరచుగా ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేయడం జరుగుతుందని, రైతులను మోసం చేయాలని చూసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారుల సూచన మేరకు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏ దుకాణాలలో కొనుగోలు చేసినా తప్పకుండా రశీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో విడి విత్తనాలు, నకిలీ విత్తనాలు, పురుగు మందులు ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చేవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట గజ్వేల్ ఎస్ఐ యాదగిరిరెడ్డి, ఏఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలుర కళాశాలలో ఖాళీల భర్తీకి కౌన్సిలింగ్

**నర్సాపూర్ మే 25, ప్రభాతవార్త :** పట్టణ సమీపంలో గల తెలంగాణ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో 2024..25 సంవత్సరానికి గాను సిఈసీ ఒకేషనల్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేయుటకు గాను రెండవ విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య ఒక ప్రకటలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విధ్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబందిత ఒరిజనల్ పత్రాలను తమ వెంట తీసుకొని ఈ నెల 28 న నర్సాపూర్‌గిరిజన బాలుర కళాశాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ బిక్షపమయ్య తెలిపారు.

# యధేచ్ఛగా మట్టి అక్రమ రవాణా...!?

- ఇటుకబట్టీలకు తరలుతున్న చెరువుమట్టి
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- రైతాంగానికి తీరని నష్టం
- చోద్యం చూస్తున్న అధికారులు

**హుస్నాబాద్, మే 25, ప్రభాతవార్త :** ఇటుకలు తయారుచేసి విక్రయాలు జరపడం ఒక వ్యాపారం. అది నిర్వహించేందుకు రెవెన్యూ, మైనింగ్‌తోపాటు కాలుష్య నియంత్రణ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. దీనికి ప్రభుత్వానికి కొంతమేర పన్ను కట్టాల్సి ఉంటుంది. హుస్నాబాద్‌లో అక్రమ వ్యాపారులు ఇవేవి పట్టించుకోకుండా ఎక్కడబడితే అక్కడ బట్టీలు పెడుతున్నారు. ఇటుకల తయారీకి అనువైన భూమి, సరిపడా నీరు, విద్యుత్ లాంటి సౌకర్యాలు ఉంటేచాలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే దందా సాగిస్తున్నారు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని పంట భూములను బొందల గడ్డలుగా మార్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధి కారులు పట్టించుకోకపోవడంపట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇటుక బట్టీల దందా జోరుగా కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. పొలాలకు తరలించాల్సిన చెరువులోని నల్లమట్టిని అక్రమంగా ట్రాక్టర్‌ల ద్వార ఇటుక బట్టీలకు తరలిస్తూ రూ కోట్లు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ అక్రమదందాను అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు.

**బుగ్గిపాలవుతున్న కలప...**

ప్రభుత్వం ఒకవైపు హరితహారంలోభాగంగా రూ.కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు పెంచుతుంటే మరోవైపు ఇటుక వ్యాపారులు భారీ వృక్షాలను నరికేస్తున్నారు. కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి రైల్వే బొగ్గును సైతం దిగుమతి చేసుకుని ఇటుకబట్టీలకు వాడుతున్నట్లు తెలుస్తోంది.ఇటుక బట్టీలకు అనువైన స్థలంలో అనువైన మట్టిని చూసుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు.



అర్ధరాత్రి చెరువులో నుండి అక్రమంగా తరలిస్తున్న మట్టి (ఫైల్‌ఫోటో)

**యధేచ్ఛగా విద్యుత్ దుర్వినియోగం....**

రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొంత మంది బట్టీల వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాడుతున్నారు. విద్యుత్ శాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ శాఖకు లక్షలలో ఆదాయం నష్టపోవాల్సి వస్తుంది.

**మైనింగ్ అధికారులకు ఎర...!**

ఇటుక బట్టీలకు కావాల్సి మట్టిని తవ్వాలన్నా.. తరలించాలన్నా రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కాని వ్యాపారులు సంబంధిత అధికారులకు మామూళ్ల ఎరవేస్తూ గుట్టుచప్పుడు కాకుండా చెరువులు కుంటలలో జెసిబిలు, ట్రాక్టర్ల సహాయంతో అర్ధ రాత్రి బటీ్టలకు తరలిస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు. సంబంధిత అధికారులు ఇకనైనా నిబంధనలు పకడ్బందీగా అమలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

**మట్టి తరలించేందుకు వ్యవసాయ ట్రాక్టర్లు...!**

నిబంధనలప్రకారం వ్యవసాయేతర కార్యక్రమాలు నిర్వహించేందుకు కమర్షియల్ వాహనాలు వినియోగించాల్సి ఉంటుంది. అయితే హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలకు నల్లమట్టిని తరలించేందుకు నిబంధనల ప్రకారం కమర్షియల్ వాహనాలు వాడకుండా వ్యవసాయ ఉత్పత్తుల కోసం వాడాల్సిన వ్యావసాయ ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఉపయోగించే ట్రాక్టర్లు బావుల వద్ద, ఇంటి వద్ద ఉండాల్సి ఉండగా వాటి నెంబర్ ప్లేట్లను తొలగించి రాత్రి వేళల్లో చెరువులు కుంటల నుండి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ట్రాక్టర్లకు సైత ం ఎలాంటి అనుమతి పత్రాలు ఫిట్‌నెస్‌లు తీసుకోకుండా మైనర్లకు వాహనాలు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈవిషయంపై జిల్లా రవాణా శాఖ అధికారితోపాటు హుస్నాబాద్ రవాణా శాఖ అధికారులు దృష్టిసారించి వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన ఒక మంత్రి ఈ అక్రమ ఇసుక రవాణా, మట్టి తరలింపును అడ్డుకోకుండా వారికి అధికారులు చేయూతనందించాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్టు వినికిడి.

